
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ౹ 19 ౹ సెప్టెంబర్ ౹ 2024



నిమజ్జనంలో జాప్యం

భద్రాచలంలో గోదావరి ఒడ్డున వినాయక నిమజ్జనాలు బుధవారం కూడా కొనసాగగా, భారీ విగ్రహాలతో జాప్యం జరిగింది. 8లో



నిబంధనలు పాటించాల్సిందే..

మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఐ సంపత్ హెచ్చరించారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికం అవుతుంది. రాత్రికి కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్యాణం... కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామి వారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్య సన్నిధిలో మానుకోట ఎంపీ

భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని బుధవారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయాల మేరకు స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేసిన ఎంపీకి పండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆ తర్వాత పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హోమం చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం యాగశాలలో మండపారాధన, గణపతిపూజ చేసి, చండీ హోమం, చివరన పూర్ణాహుతి జరిపించారు. హోమంలో పాల్గొన్న 24 మంది దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆయిల్‌పామ్ గెలలు తీసుకురావొద్దు

అశ్వారావుపేటరూరల్: ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యాన అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు గెలలు భారీగా రావడంతో నిల్వలు పేరుకుపోయాయి. దీంతో రెండు రోజులపాటు గెలల దిగుమతి నిలిపివేశామని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. గురు, శుక్రవారాల్లో రైతులు గెలలను తీసుకురావొద్దని సూచించారు. తిరిగి ఈనెల 21వ తేదీ శనివారం నుంచి గెలలను యథావిధిగా దిగుమతి చేసుకుంటామని తెలిపారు.

అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షణ



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ బీమానాయక్, అధికారులు

కరకగూడెం: అడవుల సంరక్షణను బాధ్యతగా భావిస్తూ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉద్యోగులు పర్యవేక్షించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) బీమానాయక్ ఆదేశించారు. కరకగూడెం మండలంలోని రాయనపేట, పోలకమ్మతోగు అటవీ బీట్ పరిధిలో ప్లాంటేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ అడవులను సంరక్షించడంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. కాగా, పోడు పేరుతో ఎవరైనా అడవిని నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ విస్తీర్ణం పెరుగుదలపై దృష్టి సారిస్తూ సంరక్షించుకోవాలని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్, మణుగూరు ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ సయ్యద్ మక్సూద్, ఏడూళ్ల బయ్యారం రేంజర్ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



కోల్డ్‌బెల్ట్‌లో కోల్డ్‌వార్!

సింగరేణిపై పెరిగిన రాజకీయ జోక్యం

- ఏళ్ల తరబడి ఒకే పోస్టులో ఉన్నతాధికారులు
- డైరెక్టర్ పా నియామకంలో ఖద్దరు పెత్తనం
- ఏకపక్ష నిర్ణయాలపై తర్జనభర్జనలో అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత పదేళ్లుగా సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యంతో సంస్థలో ఉన్నత స్థాయిలో పని చేసే అధికారులు, టాప్ మేనేజ్‌మెంట్‌కు మధ్య పొసగని వాతావారణం పెరిగిందా అంటే అవుననే సమాధానం వస్తోంది. ముఖ్యంగా సంస్థలో రెండో అత్యున్నత పోస్టుగా ఉన్న 'పా' కేంద్రంగా సంస్థలో కోల్డ్‌వార్ మొదలైందనే ప్రచారం జరుగుతోంది.

'పా' తొలగింపుతో..

సాధారణంగా ఎవరైనా ఉద్యోగి లేదా అధికారి తప్పు చేస్తే షోకాజ్ నోటీస్ జారీ చేయడం, వివరణ తీసుకోవడం, విచారణ చేపట్టడం వంటి పనులు చేస్తారు. ఏ తప్పూ జరగలేదని తేలితే వదిలేయడం, పొరపాటు జరిగినట్టు తేలితే హెచ్చరించడం చేస్తారు. పొరపాటు తీవ్రత ఎక్కువగా ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. కానీ సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఉంటూ పా (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్)గా అదనపు బాధ్యతలు చూసిన ఎన్.వీ.కే. శ్రీనివాస్‌ను ఆకస్మాత్తుగా పదవీ బాధ్యతల నుంచి తప్పించడం చినికిచినికి గాలివానగా మారుతోంది. పా, డైరెక్టర్ వంటి కీలక హోదాల్లో కొనసాగుతున్న ఉన్నత ఉద్యోగిని ఏ కారణంతో బాధ్యతల నుంచి తప్పించారనే అంశంపై ఇటు ప్రభుత్వం నుంచి కానీ అటు టాప్ మేనేజ్‌మెంట్ నుంచి కానీ కనీస స్థాయిలో వివరణ లేదు. తొలగింపు, ఇతరులకు అదనపు బాధ్యతల అప్పగింతలన్నీ మౌఖిక ఆదేశాల రూపంలో జరిగినట్టు తెలుస్తోంది.

మేనేజ్‌మెంట్‌లో..

సింగరేణిలో కార్మికులు, మినిస్టీరియల్ సిబ్బందిని మినహాయిస్తే మేనేజ్‌మెంట్ ట్రైనీ హోదాలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉన్నతోద్యోగులుగా చేరుతారు. అక్కడి నుంచి అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, ఏజెంట్, ప్రాజెక్ట్ ఆఫీసర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ వరకు చేరుకుంటారు. ఆ తర్వాత ఎలక్ట్రిక్, మెకానిక్ (ఈఅండ్‌ఎం), ఆపరేషన్స్, ప్లానింగ్ ప్రాజెక్ట్స్, ఫైనాన్స్ నలుగురు డైరెక్టర్లు ఉంటారు. జనరల్ మేనేజర్‌గా రెండేళ్లకు పైగా సర్వీసు పూర్తి చేసిన వారి సర్వీసు, పనితీరు, ప్రతిభ ఆధారంగా డైరెక్టర్లుగా రాష్ట్ర ఎనర్జీ విభాగం ఎంపిక చేస్తుంది. ఈ నలుగురు డైరెక్టర్లకు అదనంగా పా (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్), చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లుగా ఇద్దరు అధికారులు ఉంటారు. ఇందులో పా, సీఎండీ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వీరు సాధారణంగా మూడేళ్ల పాటు ఈ పోస్టులో ఉండి వెళ్లిపోతుంటారు.

పాత వాసనలేనా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చినా పాత వాసనలు ఇంకా పోలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆలిండియా సర్వీస్‌ల నుంచి వచ్చే ఉద్యోగుల మెడ మీద తుపాకి పెట్టి సింగరేణిలోనే కెరీర్ ప్రారంభించి ఇక్కడే విరమణ పొందే అధికారులను ఖద్దరు నేతలు బలి చేస్తున్నారనే అభిప్రాయం కోల్‌మైన్స్‌లో వ్యక్తమవుతోంది. సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాల్సిన స్థానంలో ఏకపక్ష నిర్ణయాలను సంస్థ మీద రుద్దుతున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. తాజాగా ఎన్.వీ.కే. శ్రీనివాస్‌ను రాజకీయపరమైన కారణాలతో తొలగించారనే ప్రచారం జోరందుకుంది. ఈ మేరకు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ కూడా ఎన్.వీ.కే. శ్రీనివాస్‌కు మద్దతుగా గళం విప్పడం గమనార్హం.

పదేళ్లుగా ఇదే తంతు..

తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి సీఎండీగా ఎన్. శ్రీధర్ రికార్డు స్థాయిలో తొమ్మిదేళ్లకు పైగా పని చేశారు. సుదీర్ఘ కాలం సీఎండీగా శ్రీధర్‌ను కొనసాగించడం గత ప్రభుత్వ హయాంలో తీవ్ర విమర్శలకు దారి తీసింది. కొందరైతే ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే అప్పటి ప్రభుత్వం ఈ విషయంలో ఎంతకీ వెనక్కి తగ్గలేదు. పైగా ఆ కాలంలో రెండో అత్యున్నత పోస్ట యిన 'పా'గా సివిల్ సర్వీసెస్ నుంచి వచ్చిన అధికారిని నియమించడంపై ఆసక్తి చూపలేదు. డైరెక్టర్లలో ఒకరికి పా గా అదనపు బాధ్యతలు ఇస్తూ వచ్చారు. దీంతో 'పా' పోస్టులో ఉన్న అధికారులు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. 2018లో ఐఆర్‌ఎస్ అధికారిగా ఉన్న ఎన్.బలరాంనాయక్ నేరుగా డైరెక్టర్ ఫైనాన్స్ హోదాలో 'పా' బాధ్యతలు చేపట్టినా మధ్యలో కొంతకాలం ఈ బాధ్యతల నుంచి దూరంగా ఉండి మళ్లీ వచ్చారు. రాష్ట్రంలో కొత్త సర్కారు ఎన్నికైన తర్వాత సీఎండీ శ్రీధర్ బదిలీ కాగా ఆయన స్థానంలో పా నుంచి సీఎండీగా బలరాం పదోన్నతి పొందారు. దీంతో ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఉన్న ఎన్.వీ.కే. శ్రీనివాస్ 'పా' అయ్యారు. అయితే ఏడాది పూర్తి కాకముందే ఆయన ఆ కుర్చీ దిగిపోవాల్సి వచ్చింది.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



బూర్గంపాడు ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం

బూర్గంపాడు/భద్రాచలం అర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి, భద్రాచలం ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతీ ఒక్కరు సమయ పాలన పాటించాలని సూచించారు. రెండు ఆస్పత్రుల్లోనూ పేషెంట్ల వద్దకు వెళ్లి సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. బూర్గంపాడు ఆస్పత్రిలో ఐటీసీ వారు టాయిలెట్లు నిర్మించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్.. పేషెంట్లకు అనువుగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చురీ శిథిలావస్థకు చేరడి కొత్తగా నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆస్పత్రిలో నూతన భవనాల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాల సమస్యలను కొందరు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు ఇటీవల వచ్చిన పీడీ డిప్యుటేషన్‌పై వేరే చోటకు వెళ్తున్నారని, దీంతో ఇక్కడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భద్రాచలం ఆస్పత్రిని సందర్శించారు. ఏపీలోని ఎటపాక మండలానికి చెందిన ఆరేళ్ల బాలుడు తీవ్ర అనారోగ్యానికి గురై ఆశ కార్యకర్త ద్వారా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను సంప్రదించగా.. సదరు బాలుడిని ఆదుకుంటానని రామకృష్ణ చెప్పడంతో కలెక్టర్ ఆయనను అభినందించారు. ఆ తర్వాత కంటి ఆపరేషన్ విభాగాన్ని పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో భద్రాచలం ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌ల కొరత ఉండేదని, ఇప్పుడు ముగ్గురు పని చేస్తుండడంతో ఆ సమస్య పరిష్కారం అయిందని చెప్పారు. డయాలసిస్ విభాగంలో సరిపడా మందులు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న ఇతర సమస్యలను మూడు విడతల్లో పరిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి చికిత్స కోసం ఈ ఆస్పత్రికి వస్తుంటారని, వారందరికీ మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత ఇక్కడి డాక్టర్లపై ఉందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త రవిబాబు, తహసీల్దార్లు ముజాహిద్, శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్యులు అనిత, సబితారెడ్డి, మౌనిక, దేవరాజ్, క్రాపా విజయ్, సంతోష్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులతో అధిక లాభాలు

కొత్తగూడెంరూరల్ : మిల్క్‌పార్లర్‌లో బ్రాండింగ్ ఉత్పత్తులతోపాటు ప్యాకింగ్ చేసి విక్రయిస్తే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్‌లో కృష్ణవేణి గ్రామ సంఘం ఆద్వర్యంలో అంజన, విజయలక్ష్మి నిర్వహిస్తున్న మిల్క్ పార్లర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రూపు మహిళల వ్యాపార లావాదేవీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ ద్వారా రూ.4 లక్షలు, సీఐఎఫ్ ద్వారా రూ.2 లక్షలు రుణం తీసుకున్నామని, రెండు నెలల క్రితం వ్యాపారం ప్రారంభించామని, సీజన్‌లో రోజుకు రూ.15 వేలు, అన్ సీజన్‌లో రూ.5 వేల వ్యాపారం సాగుతోందని, లాభాలు కూడా బాగానే వస్తున్నాయని మహిళలు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనంలో కలుపు మొక్క!

రూ 1.14 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఉద్యాన శాఖాధికారి



పట్టుబడిన సూర్యనారాయణతో ఏసీబీ అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఉద్యాన వనంలో పెరిగిన 'కలుపు మొక్క' అవినీతిని ఏసీబీ అధికారులు బుధవారం ఆటకట్టించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మహబూబాబాద్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి కె సూర్యనారాయణ ఇక్కడికి వచ్చారు. వచ్చిన రోజు నుంచే కిందిస్థాయి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించేవారు. ఆయన వైఖరితో కొందరు అధికారులు జిల్లాకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నా ఆప్షన్‌లో ఎంచుకోలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, జిల్లాలోని రైతుల భూముల్లో సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఓ కంపెనీ అమర్చింది. దీన్ని జిల్లా ఉద్యానవన అధికారి ధ్రువీకరిస్తేనే సదరు కంపెనీకి బిల్లులు వస్తాయి. దీంతో వారు సూర్యనారాయణను సంప్రదించగా బిల్లులో రెండు శాతం కమీషన్ ఇస్తేనే ఫైల్‌ను కలెక్టర్‌కు పంపిస్తానని చెప్పాడు. అంతేకాక తాను గతంలో పనిచేసిన మహబూబాబాద్ జిల్లాలోనూ ఇదే కంపెనీ తనకు రూ.85 వేలు ఇవ్వాల్సి ఉందని, ఆ మొత్తంతో పాటు ప్రస్తుత బిల్లు కమీషన్ కలిపి రూ.1.14 లక్షలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో సదరు కంపెనీ ఇంజనీర్ ఏసీబీని ఆశ్రయించగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తదితరులు పక్కా ప్రణాళిక రూపొందించారు. కంపెనీ ఇంజనీర్ సూర్యనారాయణకు బుధవారం సాయంత్రం రూ.1.14 లక్షలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు సూర్యనారాయణపై కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారిలో సీఐలు శేఖర్, రామారావు, హెడ్‌కానిస్టేబుల్ పుల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా అవినీతికి పాల్పడి లంచం అడిగితే 1064 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

25న జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపికలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 25న జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖాధికారి (డీవైఎస్‌ఓ) ఎం.పరందామరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన యుజనోత్సవాల సందర్భంగా ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారు అర్హులని, జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయికి, అక్కడ ఎంపికైన వారిని వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు.

జిల్లాస్థాయి పోటీల్లో..

జానపద నృత్యం ఫోక్ సాంగ్స్ (సోలో, గ్రూప్స్), జానపద గేయాలు (సోలో, గ్రూప్), కవిత్వం, వ్యాస రచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వంతో పాటు సైన్స్ మేళా విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈ నెల 23 వరకు పేరు, పుట్టినరోజు, తేదీ, ఆధార్, అడ్రస్, ఫోన్ నంబర్, ప్రదర్శన పేరు వంటి వివరాలతో ఈ–మెయిల్ అడ్రస్‌కు www. dysobhadradri@gmail. comకు లేదా డీవైఎస్‌ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 95054 23226 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కనకగిరి గుట్టల్లో ఐటీడీఏ అధికారులు



కాకతీయుల రక్షణ వలయం గోడను పరిశీలిస్తున్న అధికారులు



గుట్టల నుంచి కిందకు దిగుతున్న అధికారులు

- కాలినడకన గుట్టలపైకి..
- కలెక్టర్ ఆదేశాల మేరకు సందర్శన

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు శివారులో గల కనకగిరి గుట్టలను భద్రాచలం ఐటీడీఏ అధికారులు బుధవారం సందర్శించారు. ఇటీవల కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ గుట్టలను సందర్శించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన ఆదేశాల మేరకు ఐటీడీఏ ఏపీఓ (జనరల్) డేవిడ్ రాజు, జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, ఐటీడీఏ ఉద్యాన శాఖాధికారి ఉదయ్‌కుమార్ గుట్టలపై ఉన్న కాకతీయుల కట్టడాలను పరిశీలించారు. హస్తాల వీరన్న స్వామి, వీరభద్రస్వామి ఆలయాలను సందర్శించారు. పర్యాటక కేంద్రం కోసం ఎక్కడెక్కడ సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందనే వివరాలను పరిశీలించారు. సదుపాయాలు కల్పించాల్సిన ప్రాంతాలను గుర్తించి, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. ఇక్కడి ప్రకృతి అందాలు రమణీయంగా ఉన్నాయని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం గుట్టల కింది భాగంలో ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను సందర్శించిన అధికారులు.. వెదురుతో తయారు చేసిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో బ్యాంబో క్లస్టర్ సభ్యులు ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, వర్సా శ్రీను, కారం అన్వేష్, చీదర ప్రసాద్, మల్లం వెంకటేష్, మంగపతి పాల్గొన్నారు.

ముగిసిన కంపెనీస్థాయి పోటీలు

- మిస్టర్ సింగరేణిగా జేవీఆర్ ఓసీ కార్మికుడు రామకృష్ణ
- స్ట్రాంగ్ ఉమెన్‌గా మాన్విత‌తో పాటు ఇతర విభాగాల్లో విజేతల ఎంపిక



పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాసరావు, పక్కన అధికారులు, నాయకులు



మాన్విత, స్ట్రాంగ్ ఉమెన్ (కొత్తగూడెం ఏరియా)



ఎస్.శ్రీనివాస రెడ్డి, స్ట్రాంగ్ మెన్ (భూపాలపల్లి ఏరియా)



కె.అనిల్‌కుమార్, బెస్ట్ లిఫ్టర్ మెన్ (మణుగూరు ఏరియా)

సింగరేణి(కొత్తగూడెం): స్థానిక సీఈఆర్ క్లబ్‌లో రెండు రోజుల పాటు కొనసాగిన కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీలకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి ఆరు జట్లకు గాను 250 మంది హాజరయ్యారు. ఇందులో 50 మంది మహిళా ఉద్యోగులు కూడా ఉత్సాహంగా పాల్గొని కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పర్సనల్ జీఎం(సెక్యూరిటీ) కోడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ప్రతీ సంవత్సరం సంస్థ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్, ఏరియా, కంపెనీ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామని, ఇక్కడ ప్రతిభ చాటిన వారిని కోలిండియా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. క్రీడాకారుల సంక్షేమమే ధ్యేయంగా సీఎండీ బలరామ్ ప్రత్యేక బడ్జెట్ కేటాయించారని చెప్పారు. అనంతరం విజేతలను సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్)జి.రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నాయకులు పీతాంబరం, సీఎంఓఏఐ ఉపాధ్యక్షులు కేశవరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పాసినెట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పవర్ లిఫ్టింగ్ విభాగంలో స్ట్రాంగ్ ఉమెన్‌గా కొత్తగూడెం ఏరియాకు చెందిన మాన్విత(282 కేజీలు), స్ట్రాంగ్ మెన్‌గా భూపాలపల్లి కేటీకే – 6 ఇంక్లైయిన్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్‌రెడ్డి(612 కేజీలు), బెస్ట్ వెయిట్ లిఫ్టర్‌గా మణుగూరు ఏరియాకు చెందిన కె.అనిల్‌కుమార్(142 కెజీలు), మిస్టర్ సింగరేణిగా కొత్తగూడెం ఏరియా జేవీఆర్ ఓసీ కార్మికుడు ఎంపికయ్యారు.

మొదటిసారి ఎంపికయ్యా



కొత్తగూడెంలో బుధవారం జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి కోలిండియా పోటీలకు మొదటి సారి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. క్రీడల విషయంలో సింగరేణి కంపెనీ ఆడ, మగ తేడా లేకుండా అందరినీ ప్రోత్సహిస్తోంది. ఇక ముందు కూడా ఇలాగే క్రీడాకారులను ఉత్సాహ పరిస్తే మరింతగా రాణించే అవకాశం ఉంది.

– కె.రేణుక, భూపాలపల్లి ఏరియా



మిస్టర్ సింగరేణిగా ఎంపికైన రామకృష్ణ

మరింతగా ప్రోత్సహించాలి



నేను 22 సార్లు కోలిండియా పోటీలకు హాజరై 18 బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు సాధించా. అయినా కంపెనీ నుంచి సరైన ప్రోత్సాహం లభించడం లేదు. సింగరేణిలో వెయిట్‌లిఫ్టింగ్‌కు సరైన ప్లాట్‌ఫామే లేదు. పవర్ లిఫ్టింగ్‌కు బెల్ట్‌లు, బ్యాండేజీలు లేవు. పవర్ ర్యాక్స్ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో పతకాలు సాధించేలా ప్రయత్నిస్తాం.

– జి.రాజయ్య, ఫిట్టర్ ఆర్జీ -1 ఏరియా

మూడోసారి కోలిండియా పోటీలకు..



కంపెనీ సహకారంతో ఇప్పటికి రెండుసార్లు కోలిండియా పోటీలకు వెళ్లా. ఇప్పుడు జరిగిన కాంపిటేషన్‌లో విజేతగా నిలిచి మూడోసారి కూడా ఎంపికయ్యా. సింగరేణి సంస్థ ఉద్యోగంతో పాటు, ఉల్లాసానికి సహకరిస్తోంది. ఏరియాల్లో స్పోర్ట్స్ సూపర్ వైజర్లను నియమించి మెరుగైన శిక్షణ ఇప్పిస్తోంది.

– పి.శ్వేత, భూపాలపల్లి ఏరియా

కోలిండియా పోటీల్లో సింగరేణి కీర్తిని చాటుతా



కొత్తగూడెంలో బుధవారం జరిగిన పోటీల్లో నా ప్రతిభను పరిగణనలోకి తీసుకున్న సింగరేణి యాజమాన్యం నన్ను కోలిండియా పోటీలకు ఎంపిక చేసింది. నాపై యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కోలిండియా పోటీల్లో సత్తా చాటుతా. తద్వారా సింగరేణి కీర్తిని మరింతగా ఇనుమడింపజేస్తా.

– శ్రీలేఖ, కేటీకే–5, భూపాలపల్లి ఏరియా

క్లుప్తంగా

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని కేజీబీవీలలో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ పోస్టుల భర్తీకి గతేడాది జూలైలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులతో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 జాబితాలో ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో 20న నిర్వహించే వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. 1:3 జాబితాలో ఉన్న అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఏఎల్‌ఎంకు గాయాలు

- ఫ్యూజు వేస్తుండగా ప్రమాదం


విద్యుదాఘాతంతో గాయపడ్డ రామకృష్ణ

పాల్వంచరూరల్: సబ్ స్టేషన్ ఆపరేటర్ ఎల్‌సీ ఇవ్వకపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు వేస్తున్న అసిస్టెంట్ లైన్‌మన్(ఏఎల్‌ఎం) విద్యుదా ఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన నాగారం వద్ద బుధవారం జరిగింది. విద్యుత్‌శాఖ ఏడీఈ కథనం ప్రకారం.. సీరుడు రామకృష్ణ మండల పరిధిలో ని నాగారం సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం నాగారం శివారు తోగ్గూడెం రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోయింది. దీంతో ఫ్యూజ్ వేసేందుకు ఏఈ ఫోన్ ద్వారా సబ్‌స్టేషన్ ఆపరేటర్ సారయ్యను లైన్‌క్లియర్(ఎల్‌సీ) అడిగాడు. అసిస్టెంట్ లైన్‌మన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. శరీరం కాలి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఏడీఈ విచారణ

ఈ ఘటనపై ఏడీఈ లక్ష్మణ్, ఏఈ రవీందర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో మీటర్ రీడింగ్ ఇనుస్ట్రమెంట్‌ను(ఎంఆర్‌ఐ)ని స్వాధీనం చేసుకుని డివిజన్ ఆఫీసుకు పంపించారు. అక్కడ పరిశీలించగా ఎల్‌సీ ఇవ్వలేదని తేలింది. దీంతో ఆపరేటర్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి సారయ్యను విధుల నుంచి తొలగించినట్లు ఏడీఈ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో కేసుపై విచారణ

ములకలపల్లి: విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందడంతో ఉపాధ్యాయుడు తేజావత్ శ్రీనివాస్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బుధవారం విచారణ చేపట్టారు. పాల్వంచలోని సీఐ కార్యాలయంలో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారి నుంచి వివరాలు సేకరించారు. స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

అసత్య ప్రచారంతో అభాసుపాలు చేస్తున్నారు

గుట్టగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తేజావత్ శ్రీనివాస్‌పై అసత్య ప్రచారం చేస్తూ అభాసుపాలు చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల విద్యార్థులను కొందరు యువకులు బెదిరించి శ్రీనివాస్‌పై తప్పుడు సాక్ష్యం చెప్పించారని, పోక్సో కేసు నమోదయ్యేలా చేశారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీయాలని కోరారు. కాగా, పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిపై తప్పుగా చెప్పాలంటూ కొందరు వ్యక్తులు తమను బెదిరించినట్లు తెలిపారు. ఈవిషయమై ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదుపై విచారణ చేపడతామని తెలిపారు.


మరుగుదొడ్లను తొలగించాలి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా తాతగుడి సెంటర్ వద్ద ఉన్న గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లను తొలగించాలని బుధవారం ఈఓ రమాదేవి ఆ దుకాణాల యజమానులకు నోటీస్‌లను జారీ చేశారు. ఆలయ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, అదేవిధంగా హిందూ దేవాలయ సంప్రదాయం ప్రకారం ఉండకూడదని పేర్కొన్నారు. పది రోజుల్లో తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీస్‌లో పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్ట్

భద్రాచలం అర్బన్: భద్రాచలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భద్రాచలం పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులు బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందినవారుగా విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని సైతం పట్టుకుంటామని వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392


కరకట్ట మీద వాహనాల వరుస


నిమజ్జనానికి వచ్చిన మట్టి విగ్రహం


బొజ్జ గణపయ్యలను నిమజ్జనం చేసేందుకు లాంచీపై తీసుకెళ్తున్న సిబ్బంది

ఐదేళ్లుగా మట్టి వినాయకుడిని పూజిస్తున్నాం..



పర్యావరణానికి హాని కలిగించకూడదనే ఆలోచనతో ఐదేళ్లుగా మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిఏటా అర అడుగు పెంచుకుంటూ ఈ ఏడాది 13.5 అడుగులకు చేరింది. అధికారుల ఏర్పాట్లు బాగున్నాయి. క్రమపద్ధతిలో విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు.

– నరేష్, లక్ష్మిగణపతి యూత్, కొత్తగూడెం

భారీ విగ్రహాలు.. ఆలస్యంగా నిమజ్జనం

- రాష్ట్ర నలుమూలల నుంచి గణనాథులతో తరలివచ్చిన భక్తులు
- గోదావరి ఒడికి ఇప్పటివరకు 1,283 ప్రతిమలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి ఒడ్డున ఉన్న వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు బుధవారం కూడా కొనసాగాయి. భారీ విగ్రహాలు తరలి రావడంతో నిమజ్జనానికి ఆటంకం కలిగింది. బుధవారం భద్రాచలంలో ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో నిమజ్జనం చేసే సిబ్బంది అలసిపోయారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి బుధవారం రాత్రి వరకు నిమజ్జనానికి 283 వినాయకుడి విగ్రహాలు రాగా, వీటిలో 60 శాతం విగ్రహాలు భారీగా ఉండటంతో స్విమ్మర్లు కూడా వీటి బరువు అంచనా వేసుకుని, కేవలం ఒక్క ట్రిప్పునకు ఒక్క విగ్రహాన్నే నిమజ్జనం చేయాల్సి వచ్చింది. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచి ముందుగా చిన్న విగ్రహాలను నిమజ్జనం చేయాలని, ఆ తర్వాత పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు. దీంతో అప్పటివరకు గోదావరి తీరంలో అధిక సంఖ్యలో కనిపించిన విగ్రహాలు తగ్గుతూ వచ్చాయి. గడిచిన పది రోజులుగా 1,283 గణపతి విగ్రహాలు గోదావరిలో నిమజ్జనానికి వచ్చాయని సిబ్బంది తెలిపారు.

బల్లకట్టు ఏర్పాటు దిశగా చర్యలు

భద్రాచలంలో ప్రతి ఏడాది జరిగే గణేష్ నిమజ్జ నానికి బల్లకట్టుని ఏర్పాటు చేస్తే వరద తగ్గినా ఎటువంటి సమస్య తలెత్తదని, ఎక్కువ సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఆస్కారం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని రామగుండంలో ఈ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. గణేష్ నిమజ్జనంతో పాటు భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానానికి సంబంధించి గోదావరిలో నిర్వహించే వేడుకలకు కూడా ఉపయోగపడుతుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ధవలేశ్వరంలో ఉన్న బల్లకట్టు నిర్వాహకులను సంప్రదించినట్లు సమాచారం.


క్రేన్ సహాయంతో వాహనం నుంచి కిందకు దించుతున్న విగ్రహం

భక్తులు, స్విమ్మర్ల వాగ్వాదం

కొత్తగూడెం రామవరానికి చెందిన భక్తులు తమ విగ్రహాన్ని తామే గోదావరిలో నిమజ్జనం చేసుకుంటామని వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారితీసింది. గమనించి పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.


గోదావరి తీరంలో నిమజ్జనానికి సిద్ధం చేసిన గణనాథుడి ప్రతిమలు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

పూసుగూడెం సెంటర్‌లో రాస్తారోకో


పూసుగూడెంలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్తులు బుధవారం పూసుగూడెం సెంటర్‌లో రాస్తారోకో చేశారు. స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటోను కారు ఎదురుగా ఢీ కొట్టిన ఘటనలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఐదుగురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్న విషయం విదితమే. ఈ క్రమంలో మృతుడి కుటుంబంతోపాటు, గాయపడ్డ వారికి ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటకుపైగా ఆందోళన చేయడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పాల్వంచ రూరల్ ఎస్సై బాల్దె సురేశ్ ఘటనాస్థలికి వచ్చి మాట్లాడారు. తహసీల్దార్ పుల్లారావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి గ్రామస్తులతో చర్చించారు. వైద్యసదుపాయం కల్పిస్తామని, ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నాలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

ప్రమాదంలో మృతిచెందిన బాలుడు రచ్చ ఈశ్వర్ (12) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తి చేశారు. మృతదేహానికి పాల్వంచ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై రాజశేఖర్ పర్యవేక్షణలో అంబులెన్స్‌లో వీకే. రామవరం తరలించారు. కుటుంబీకులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. ఇదే ప్రమాదంలో గాయపడ్డ మృతుడి సోదరుడు యశ్వంత్ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఆటో డ్రైవర్, చిన్నారి సాత్వికను హైదరాబాద్ తరలింపు

ప్రమాదంలో గాయపడ్డవారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఆటోడ్రైవర్ వటికూటి ప్రవీణ్‌తోపాటు, చిన్నారి సాత్విక పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని హైదరాబాద్ తరలించారు. జ్ఞానచరిత, మోక్షిత్‌లను ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులు ప్రవీణ్, సాత్వికలను హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నిందితుడికి రిమాండ్

రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కంటే శేఖర్‌రావును పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం కొత్తగూడెం కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో భద్రాచలం సబ్‌జైల్‌కు తరలించారు.


సాత్వికను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

15రోజుల్లో సింగరేణి కార్మికులకు లాభాల వాటా



మాట్లాడుతున్న ఆల్బర్ట్, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం)/మణుగూరు టౌన్: సింగరేణి కార్మికులకు పదిహేను రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటా అందే అవకాశముందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు ఆల్బర్ట్ తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ లాభాల్లో గత ఏడాది 32శాతం వాటా చెల్లించగా, ఈసారి మరింత పెంచేలా యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సారథ్యాన సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరిగాయని చెప్పారు. ఈమేరకు సానుకూలంగా స్పందించిన నేపథ్యాన పదిహేను రోజుల్లో నికరలాభాలు ప్రకటించడమే కాకుండా 35శాతం వాటా చెల్లిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ విషయమై ముఖ్యమంత్రి సింగరేణి అధికారులతో చర్చించే అవకాశముందని తెలిపారు. కాగా, గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన సంఘం నాయకులు తొమ్మిది నెలల కాలంలో కార్మికుల సమస్యలను విస్మరిస్తూ కాలం గడిపారని ఆల్బర్ట్ ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ.రజాక్, పీతాంబరం, అభిషేక్, మహేష్, గౌస్, బి.రాజేశ్వరరావు, భీముడు, పోశం శ్రీను, నాగిరెడ్డి, గారె బాబు, శ్యాం తదితరులు పాల్గొన్నారు. అలాగే, మణుగూరులో జరిగిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ పదిహేను రోజుల్లో లాభాల వాటా అందనుండగా, మిగతా హామీల అమలుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకులు షాబుద్దీన్, సూరపాక రాములు, మిద్దపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్


మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

బూర్గంపాడు: మెడికల్ షాపుల్లో కచ్చితంగా డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం–1940 ప్రకారం నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ హెచ్చరించారు. మండలంలోని బూర్గంపాడు, సారపాక, నాగినేనిప్రోలు, మోరంపల్లిబంజర, లక్ష్మీపురంలలోని పలు మెడికల్‌షాపులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ షాపుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు గుర్తించి నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. రిజిస్టర్ల నిర్వహణ, మందుల కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన బిల్లులు, ప్రిస్కిప్షన్స్‌లను పరిశీలించారు. ఫార్మసిస్టులు లేకపోవటాన్ని గుర్తించి తప్పనిసరిగా ఫార్మసిస్ట్ ఉండాలని ఆదేశించారు. నిర్దేశించిన ధరలకే మందులను విక్రయించాలన్నారు. కొన్నిరకాల డ్రగ్స్‌ను భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్లను తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పేర్కొన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అసెంబ్లీ ఓటరు జాబితా నుంచి గ్రామ పంచాయతీ ఓటరు జాబితాను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐదు పంచాయతీలు.. భద్రాచలం డివిజన్‌లో సీతానగరం, శాంతినగరం, భద్రాచలం, బూర్గంపాడులకు సంబంధించి సారపాక, ఐటీసీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 19న మండలస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 21 వరకు ఓటరుతాపై అభ్యంతరాలు తెలపాలని, వాటిని పరిశీలించి, ఈ నెల 28న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వివరించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించే 479 గ్రామ పంచాయతీల్లో 4,232 వార్డులు ఉన్నాయని, 6,23,940 మంది ఓటర్లు ఉన్నారని, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడత భద్రాచలం డివిజన్‌లో, రెండో విడత కొత్తగూడెంలోని ఏడు మండలాలు, మూడో విడత కొత్తగూడెంలో మిగిలిన ఏడు మండలాల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేస్తామని, ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు శిథిలావస్థలో ఉంటే అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధుల ఆమోదంతో ప్రైవేట్ భవనంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యెర్రా కామేష్(బీఎస్పీ), సలిగంటి శ్రీనివాస్(సీపీఐ), లక్ష్మణ్ అగర్వాల్(కాంగ్రెస్), నోముల రమేష్(బీజేపీ), అన్నవరపు సత్యనారాయణ(సీపీఎం), భద్రాచలం డివిజన్ పంచాయతీ అధికారి ఎం.సుధీర్ కుమార్, కొత్తగూడెం డివిజన్ పంచాయతీ అధికారి వై.రమణారావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

ఆత్మహత్యపై కేసు నమోదు


వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజేందర్

కరకగూడెం: వ్యక్తి ఆత్మహత్యపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని అశ్వాపురంపాడు వలస ఆదివాసీ గ్రామానికి చెందిన కోవాసి సురేష్ తన భార్యతో మంగళవారం రాత్రి డబ్బుల విషయంలో గొడవపడ్డాడు. మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతదేహాన్ని హత్తుకుని నాలుగు నెలల గర్భవతి అయిన అతని భార్య గీత రోదించడం అందరినీ కలిచివేసింది.

అప్పు కట్టలేదని..

- కులం పేరుతో దూషించారు..
- 9 మందిపై కేసు నమోదు

మణుగూరు టౌన్: భర్త మృతిచెంది బాధలో ఉన్న మహిళను అప్పు కట్టలేదని కులం పేరుతో దూషించి, వేధించిన 9 మందిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌కి చెందిన మర్రి సురేష్ అనారోగ్యానికి గురై చింత గాయత్రి, ఆమె భర్త రాముల వద్ద రూ. లక్ష అప్పు తీసుకున్నాడు. ఇందుకు నెలకు రూ. 5 వేలచొప్పున వడ్డీ చెల్లిస్తున్నాడు. ఆరోగ్యం క్షీణించి ఇటీవల మృతి చెందాడు. కాగా బాకీ కట్టాలని సురేష్ భార్య రజితను రుణదాతలు ఒత్తిడి చేశారు. ఇంట్లో ఉన్న మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15న రజిత ఇంట్లో ఉండగా, చింతా గాయత్రి, బర్ల స్వరూప, ఉజ్వల గాయత్రి, చింతా రాము, బూర్ల సతీష్‌లు కలిసి అదే బజారులో ఉన్న గురజాల గోపితో ఇంట్లోకి ప్రవేశించారు. కులంపేరుతో దూషిస్తూ సామన్లను చిందరవందర చేసి భయభ్రాంతులకు గురి చేశారు. కాగా బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న క్రమంలో విలేకరులుగా చెప్పుకునే రామారావు, పాపారావు, లెనిన్‌లు బలవంతంగా అప్పు ఇస్తామని తెల్లకాగితంపై సంతకం పెట్టించుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. దీంతో ముగ్గురు విలేకరులతోపాటు దూషించిన ఆరుగురు.. మొత్తం 9 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఏడుగురిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఖమ్మంపాడు గ్రామ సమీపంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా అశ్వారావుపేటకు ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని పోలీస్ క్వార్టర్‌కు తరలించి సీజ్ చేశారు. ట్రాక్టర్ల డ్రైవర్లు బత్తుల వెంకన్న, ఇనుమురి చిలకరాజు, తాళ్లూరి దుర్గారావు, తాళ్లూరి శ్రీను, ట్రాక్టర్ల యజమానులు డి.మంగ, ఎస్.లక్ష్మీనాగవెంకట దుర్గకుమార్, భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


పంట పొలాలను కమ్మేసిన పొగమంచు

అప్పుడే మంచు దుప్పటి !

కరకగూడెం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం పొగమంచు పరుచుకుంది. ఉదయం 8గంటల వరకు ఇదే పరిస్థితి ఉండడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. ఏటా అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసే మంచు ఈసారి ముందుగానే కనిపించడంతో చిత్రాలను స్థానికులు ఫోన్లలో బంధించారు! – కరకగూడెం


రహదారిపై...